ప్రభాత జయభేరి
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
26-06-2024
బుధవారం
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 303 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..

ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం

అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత

jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889




అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 62వ సంవత్సరంలోకి అడుగు పెట్టారు. గౌతమ్ అదానీ పుట్టిన రోజు. 61వ పుట్టిన రోజు నుంచి 62వ పుట్టిన రోజు వరకు, అంటే గత సంవత్సర కాలం అదానీకి అద్భుతంగా కలిసొచ్చింది. అమెరికన్ షార్ట్ సెల్లర్ కంపెనీ 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న అదానీ గ్రూప్ కంపెనీలు ఈ ఏడాది కాలంలో సూపర్‌గా పని చేశాయి, షేర్ ధరలు రాకెట్లలా దూసుకెళ్లాయి. దీంతో, గౌతమ్ అదానీ సంపద భారీగా పెరిగింది. సరిగ్గా ఏడాది క్రితం, 61వ పుట్టిన రోజు సమయంలో, గౌతమ్ అదానీ నికర విలువ 58.2 బిలియన్ డాలర్లు కాగా, ఇప్పుడు అది దాదాపు 106 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ ఏడాది కాలంలోనే ఆయన సంపద విలువ దాదాపు 48 బిలియన్ డాలర్లు పెరిగింది. దీనిని భారతీయ రూపాయల్లోకి మారిస్తే, గౌతమ్ అదానీ ఒక్క సంవత్సరంలోనే 4 లక్షల కోట్ల రూపాయలకు పైగా (40,06,67,52,00,000) సంపాదించారు.

# గ్రేటర్ కు లేడీ సింగం

## గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్‌గా అమ్రపాలి







## కేంద్ర మంత్రి నడ్డాతో సీఎం రేవంత్ భేటీ

- జయభేరి, న్యూఢిల్లీ:

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) 202324 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ. 323.73 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. ఎన్హెచ్ఎంలో 202425 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ. 231.40 కోట్లు మంజురు చేయాలని కోరారు. ఎన్హెచ్ ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఎన్ హెచ్ ఎం కింద తెలంగాణకు రావల్సిన పెండింగ్ నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసారు.



## కేసీఆర్ కు హైకోర్టులో ఊరట

- జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్కు హైకోర్టులో ఊరట లభించింది. 2011 రైల్ రోకో కేసులో విచారణకు హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా, తనపై నమోదైన రైల్ రోకో కేసును కొట్టివేయాలని కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



# సేమ్.. సీన్... పార్టీలు మార్పు అంతే

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 25:

తెలంగాణలో బొటాబోటీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థిరంగా ఉండేందుకు చేరికలను ప్రోత్సహిస్తోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటోంది. దీంతో తాము బలపడతామని, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను బలహీనపరుస్తున్నామని హస్తం నేతలు భావిస్తున్నారు. కానీ, ఈ విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పే ఇప్పుడు సీంఎ రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇబ్బందులను కోరి తెచ్చుకుంటున్నామని మర్చిపోతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా వారిపై ఎన్నికల్లో పోటీచేసి ఓడి పోయినవారిపై ప్రభావం పడుతోంది. ఎమ్మెల్యేల చేరికతో వారి అనుచరులు కూడా అధికార పార్టీలోకి వస్తారు. దీంతో గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి పనిచేసిన వారే ఇప్పుడు జై కాంగ్రెస్ అనాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారికి, కొత్తగా పార్టీలోకి చేరిన వారి మధ్య పోటీ నెలకొంటుంది. నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడతారు. ఇది పాత కొత్త నేతల మధ్య వైరానికి దారితీయడం ఖాయంఅధికార పార్టీలో చేరుతున్నవారు.. చేర్చుకుంటున్నవారు ఇద్దరూ నైతికతకు తిలోదకాలు ఇస్తున్నారు. రాజకీయాల్లో ఇప్పుడు ఆ పదానికే స్థానం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా

...మిగతాది 2 లో




- ఎమర్జెన్సీ పాలన దేశానికి ఓ మాయని మచ్చ
- దేశ ప్రజల గొంతు నొక్కి కాంగ్రెస్ చేసిన అరాచకాలకు నిదర్శనం
- కాంగ్రెస్ అధికార దాహానికి ఎమర్జెన్సీ నిదర్శనం
- ఇందిరను మించిన దురాలోచన రాహుల్ గాంధీది
- కేంద్ర మంత్రి బండి సంజయ్

✍ జయభేరి, హైదరాబాద్ :

దేశంలో ఎమర్జెన్సీ పాలనకు నేటికి 50 ఏళ్లు. 1975 జూన్ 25 నుండి 21 నెలలపాటు ఎమర్జెన్సీ పాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశ ప్రజల గొంతును నొక్కేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహానికి ఎమెర్జెన్సీ పాలన ఓ నిదర్శనం. అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ విరుద్ధంగా ఎన్ని అడ్డదారులైన తొక్కేందుకు, చివరకు ప్రజల ప్రాణాలను తీసేందుకు, ప్రజ్వాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వెనుకాడదనే దానికి ఎమెర్జెన్సీ పాలనే ఓ ఉదాహరణ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమెర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన

...మిగతాది 2 లో

## మేడిపల్లిలో పందెం కోళ్ళు

3 పే

### 11 మంది అరెస్ట్.. మూడు పందెం కోళ్ళు, 39,600/ నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం



## కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

- కేటీఆర్

- జయభేరి, హైదరాబాద్:

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. అధికార మత్తుతో విర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి అధికారంలో ఉన్న వారి బలం కంటే ఎప్పుడూ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా కాంగ్రెస్ అనేకసార్లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందని విమర్శించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆదానీ ఆదాయం గంటకు 42 కోట్లు

గౌతమ్ అదానీ 6162 పుట్టిన రోజుల మధ్య ఉన్న ఏడాది కాలంలో అదానీ గ్రూప్ చాలా బాగా పని చేసింది. షేర్ల ధరలు పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువలు, తద్వారా గౌతమ్ అదానీ ఆస్తిపాస్తుల విలువ పెరిగింది. 61వ పుట్టిన రోజు నుంచి 62వ పుట్టిన రోజు వరకు, గౌతమ్ అదానీ మొత్తం సంపద విలువ 82 శాతానికి పైగా పెరిగింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక తర్వాత పతనమైన అదానీ సంపద, 40 బిలియన్ డాలర్ల కంటే తక్కువకు పడిపోయింది. ఆ కనిష్ట స్థాయి నుంచి అతని నికర విలువ నిరంతరం పెరుగుతోంది. ఒక గంటకు రూ. 46 కోట్ల సంపాదన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, 2023 జూన్ 24న, గౌతమ్ అదానీ మొత్తం నికర విలువ 58.2 బిలియన్ డాలర్లు. అది ఇప్పుడు 106 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ మొత్తాన్ని భారతీయ రూపాయల్లోకి మారిస్తే 8 లక్షల 84 వేల కోట్ల రూపాయలకు పైగా (88,47,25,82,00,000) ఉంటుంది. గత ఏడాది కాలంలో ఆయన సంపద దాదాపు 48 బిలియన్ డాలర్లు లేదా రూ. 4 లక్షల కోట్లుకు పైగా పెరిగింది. ఈ లెక్కన ఒక్కో గంటకు దాదాపు 46 కోట్ల రూపాయలను (రూ. 45.74 కోట్లు) అదానీ ఆర్జించారు. ఇంకా వివరంగా చెప్పాలంటే, ఒక నిమిషానికి 76 లక్షల 23 వేల 333 రూపాయలు, ఒక సెకనుకు 1 లక్ష 27 వేల 055 రూపాయలు పోగేశారు.ఇక్కడ ఒక తమాషా ఉదాహరణ చూద్దాం. ఒక 500 రూపాయల నోటు గౌతమ్ అదానీ జేబులోంచి కింద పడిందనుకోండి. కిందకు వంగి దానిని తీసుకోవడానికి ఒక రెండు సెకన్ల సమయం పడుతుందనుకుందాం. అదానీ కిందకు వంగి ఆ 500 రూపాయల నోటును తీసుకునే సమయంలో అతను రూ. 2 లక్షల 54 వేల రూపాయలకు పైగా (2 x 1,27,055) సంపాదిస్తారు. కింద పడిన నోటును తీసుకుంటే అదానీకి రూ.500 దక్కుతుంది. కానీ, రూ.500 కోసం రెండు సెకన్ల సమయాన్ని సమయాన్ని వెచ్చించినందుకు రూ. 2 లక్షల 54 వేల రూపాయలు నష్టపోతారు.

**2024లో 21.3 బిలియన్ డాలర్లు**

ఈ క్యాలెండర్ సంవత్సరంలోనే (2024లో) గౌతమ్ అదానీ నెట్‌వర్త్ దాదాపు 25 శాతం లేదా 21.3 బిలియన్ డాలర్లు... అంటే 1 లక్ష 77 వేల కోట్లు రూపాయలు (17,77,56,70,05,000) పెరిగింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, గౌతమ్ అదానీ ప్రస్తుతం ప్రపంచ సంపన్నుల లిస్ట్‌లో 14వ స్థానంలో ఉన్నారు. ఆసియాలో రెండో అత్యంత సంపన్న వ్యాపారవేత్తగానూ నిలిచారు. ఆసియాలో అత్యంత ధనికుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ ఫస్ట్ ర్యాంక్‌లో ఉన్నారు. ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో ముకేష్ అంబానీది 12వ ప్లేస్.

## ఎమర్జెన్సీ 50 ఏళ్లు

ప్రతిపక్ష నాయకులను, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, జనసంఘ్ నాయకులను మీసా కింద జైళ్లలో పెట్టారు. పత్రికలపై సెన్సార్ విధించారు. పౌరుల ప్రాథమిక హక్కులను హరించారు. మానవ హక్కులను, స్వేచ్ఛను హరించి వేశారు. ప్రశ్నించిన ఎంపీల సభ్యత్వాన్ని కూడా రద్దు చేసిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే. తెలుగు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన డీఎస్పీ రెడ్డి జంగారెడ్డి, వి.రామారావు , జూపూడి యజ్ఞ నారాయణ, పీవీ చలపతి రావు , వెంకయ్య నాయుడు, సీహెచ్ విద్యాసాగర్ రావు , ఇంద్రసేనారెడ్డి , అశోక్ యాదవ్, తదితర ఏబీవీపీ, జనసంఘ్ కార్యకర్తలతోపాటు చాలా మంది సంఘ్ పరివార్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన చరిత్ర కాంగ్రెస్ దే. ఎమెర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ బృందం చేసిన అరాచకాలకు అంతులేదని అన్నారు. ఎమర్జెన్సీ పాలనతో విసిగిన ప్రజలు కాంగ్రెస్ ను ఓడించినా, ఆ పార్టీ నేతల్లో మార్పు రాకపోవడం సిగ్గు చేటు. కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కాంగ్రెస్ కూలదోసింది. 1947 నుంచి 2014 వరకు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కాంగ్రెస్ ఏకంగా 90 సార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసింది.

అబద్ధాలను ప్రజల్లోకి ప్రచారం చేయడం, ఎన్నికల యంత్రాంగంపై నిరాధార ఆరోపణలు, మైనారిటీల బుజ్జగింపు, ఓటుబ్యాంకు రాజకీయాలు, విభజన రాజకీయాలు, ఎన్నికల హింస, ఓటర్లను ప్రలోభ పెట్టడం, రాజ్యాంగం దాని సూత్రాల పట్ల గౌరవం లేకపోవడం వంటివి కాంగ్రెస్ లక్షణాలని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తారుమారు చేస్తుందని, రిజర్వేషన్లను నాశనం చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసిన కాంగ్రెస్ కు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలు మారలేదు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరాగాంధీని మించి పోయారు. భారతదేశాన్ని అస్థిరపరచడంలో, బలహీనపరచడంలో విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేందుకు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే.. అధికారం కోసం ఆయన మనవడు రాహుల్ గాంధీ వివిధ దేశాల్లో పర్యటిస్తూ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది అనే ముసుగులో భారత్ లో పాశ్చాత్య దేశాల జోక్యం అవసరమంటూ నిస్సిగ్గుగా వేడుకుని దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారు. ఇకనైనా కాంగ్రెస్ కుటిల రాజకీయాలను, చీకటి ఒప్పందాలను వీడి ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాలి. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై అర్థవంతంగా చర్చ జరిగేందుకు సహకరించాలి. వాటికి పరిష్కార మార్గాలను సూచించాలని కోరుతున్నానని అన్నారు.

## సేమ్.. సీన్... పార్టీలు మార్పు అంతే

చేరినవారితో ప్రభుత్వం స్థిర పడొచ్చు. కానీ, పార్టీ పరంగా మాత్రం ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో ప్రభుత్వం పడిపోతుంది.. కూలుస్తాం అన్న నేతలు కూడా ఇప్పుడు అధికార పార్టీలో చేరుతున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరని కాంగ్రెస్ పార్టీనేతలు గొప్పగా చెబుతున్నారు. గతంలో ప్రభుత్వాన్ని కూలుస్తామన్నందుకు ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా చేరికలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది. కానీ, కేసీఆర్ అనుచరులను చేర్చుకోవడం ద్వారా ముప్పు తెచ్చుకుంటున్నామన్న విషయం మర్చిపోతున్నారు. చేరికలను కాంగ్రెస్ గొప్పగా అనుకుంటోంది. కానీ అది కాంగ్రెస్ గొప్ప కాదు.. అధికారం గొప్ప అన్న విషయం విస్మరిస్తోంది. కాంగ్రెస్ విపక్షంలో ఉన్నప్పుడు ఒక్కరు కూడా చేరలేదు. ఇప్పుడు చేరుతున్నారంటే అది అధికారం గొప్పదనమే. ఇప్పుడు చేరిన వారు, చేరుతున్న వారు కూడా అధికారం అనుభవించడానికే. ఎన్నికల సమయంలో టికెట్ ఇస్తేనే పార్టీలో ఉంటారు. లేదంటే మళ్లీ వారు కేసీఆర్ పంచనో.. ఇంకో పార్టీలో కేరడం ఖాయం. ఇలాంటి చేరికతలో బీఆర్ఎస్ ఇప్పుడు బాగా నష్టపోవచ్చు.. కానీ రేపు కాంగ్రెస్‌కు కూడా ఇదే పరిస్థితి రావొచ్చు.

## తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**జయశంకర్ భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మంగళ వారం హాకింపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అవిస్కరించారు. 28వ తేదీన జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపిక వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 28వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఎంపికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా క్రీడల అధికారిని ఆదేశించారు. ఇతర వివరాలకు 9618022096, 8328577652 నంబర్లును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి సిహెచ్ రఘు, విద్యాశాఖ అధికారి ఎన్ రాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ కు లేడీ సింగం

**జయభేరి, హైదరాబాద్, జూన్ 25:**



తెలంగాణ ప్రభుత్వం వారం వ్యవధిలోనే మరోమారు ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టింది. గత వారం 18 జిల్లాల కలెక్టర్లను మార్చిన ప్రభుత్వం తాజాగా 44 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) కమిషనర్‌గా అమ్రపాలిని నియమించింది. ప్రస్తుత కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను ట్రాన్స్‌కో కమిషనర్‌గా బదిలీ చేసింది. తెలంగాణ సర్కార్ తాజాగా తీసుకన్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ప్రభుత్వంలో ఇప్పుడు సీనియర్ అధికారుల కన్నా ఎక్కువ పవర్ ఫుల్‌గా ఉన్న ఆఫీసర్ కాట అమ్రపాలి. తాజా బదిలీల్లో ఆమెను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా కూడా నియమించారు. ఇప్పటికే ఆమె జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, HGCL మేనేజింగ్ డైరెక్టర్ , హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కూడా ఉన్నారు. ఆయా పోస్టుల్లో కొత్తగా ఎవరికీ బాధ్యతలు ఇవ్వకపోవడంతో కీలక బాధ్యతలను సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారని అనుకోవచ్చు. కాట అమ్రపాలి 2010 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్. చెన్నై ఐఐటీ నుంచి బీటెక్, బెంగళూరు ఐఐఎం నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం 2010 యూపీఎస్‌లో ఆలిండియా 39వ ర్యాంక్ సాధించి ఐఏఎస్ అయ్యారు. ఈ కారణంగా సొంత రాష్ట్ర క్యాడర్‌నే కేటాయించారు. అయితే ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఆమెను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు. 2013లో వికారాబాద్ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వంలో కొన్నాళ్లు వరంగల్ కలెక్టర్ గా వ్యవహరించారు. 2018 ఎన్నికల సమయంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆమ్రపాలి, కేంద్ర ప్రభుత్వంలోకి డిప్యూటేషన్ వెళ్లారు. తర్వాత కేంద్ర సర్వీసులకు వెళ్లారు అమ్రపాలి ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్నారు. ఆమెను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రొనాల్డ్ రాస్ సెలవుపై వెళ్లగా అమ్రపాలిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆ సమయంలో విధులను సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రభుత్వ ప్రజల ప్రశంసలు పొందారు. ఈ క్రమంలో ఆమెను పూర్తి కమిషనర్‌గా నియమిస్తే సమర్థవంతగా పనిచేస్తారని భావించి ఈ నియామకం చేసినట్లు తెలుస్తోంది.అమ్రపాలి సొంత గ్రామం ఒంగోలు నగర చివరన ఉన్న ఎన్.అగ్రహారం. కాటా వెంకటరెడ్డి-పద్మావతి దంపతుల మొదటి సంతానం. విశాఖలో ఉన్నత చదువులు చదివారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో 2010 ఏఐఎస్ బ్యాచ్‌కు చెందిన అమ్రపాలి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకే కేటాయించారు. రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేంద్ర సర్వీస్‌లకు వెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరిగి రాష్ట్రానికి వచ్చారు.అమ్రపాలి తన పనితీరుతో లేడీ సింగంగా గుర్తింపు తెచ్చుకున్నారు. విధు నిర్వహణలో చాలా కఠినంగా వ్యవహరిస్తారు. ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండదు. అవతలి వాళ్లు ఎలాంటి వారైనా, ఆమె చట్ట ప్రకారం పనిచేసుకుపోతారు. ఎవ్వరినీ కేర్ చెయ్యరు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఆమెకు కీలక బాధ్యతలను అప్పగిస్తున్నారు. గతేడాది హెచ్ఎండీఏ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 7,200 చదరపు కిలోమీటర్లు, ఏడు జిల్లాల పరిధిలో ఉన్న హెచ్ఎండీఏపై తన మార్కు వేశారు. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ప్రమోషన్ లభించింది..జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులైన అమ్రపాలి ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. సిటీ వేగంగా విస్తరిస్తోంది. జనాభా సంఖ్య పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యలు చాలా ఉన్నాయి. కుక్కల పెడద పెరిగింది. వర్షాకాలంలో వరదలు నగరాన్ని ముంచెత్తుతున్నాయి. మ్యాన్ హోళ్లు, డ్రెయినేజీలు ప్రమాదకరంగా మారతాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ సిటీని అంతర్జాతీయ స్థాయిలో మరింతగా అభివృద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత ఆమెపై ఉంటుంది.ఇక ఆమ్రపాలి భర్త సమీర్ శర్మ ఐపీఎస్ అధికారి. 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనను 2018 ఫిబ్రవరి 18న పెళ్లి చేసుకున్నారు. సమీర్ శర్మది జమ్మూకశ్మీర్. ప్రస్తుతం ఆయన డామన్, దయ్యూలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పీ)గా విధులు నిర్వర్తిస్తున్నారు.

**పమేలా సత్పతికి... అదే ప్లేస్**

నాలుగు రోజుల క్రితమే 18 జిల్లాల కలెక్టర్లను మార్చిన ప్రభుత్వం తాజాగా మరోమారు బదిలీలు చేసింది. ఈ క్రమంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని ఇటీవల బదిలీ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతిని నియమించింది. అయితే తాజా బదిలీల్లో పమేలా సత్పతిని కొనసాగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అనురాగ్ జయంతిని ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయ జోనల్ కమిషనర్‌గా నియమించారు.కరీంనగర కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ నిలిచిపోవడం వెనుక ఏం జరిగిందన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పమేలా సత్పతిని కరీంనగర్ కలెక్టర్‌గా నియమించింది. ఆమె సారథ్యంలోనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు విజయవంతంగా జరిగాయి. మరోవైపు కలెక్టర్ పనితీరుపై కూడా ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేవు. ఈ నేపథ్యంలో ఆమెనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.పమేలా సత్పతి బదిలీపై కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఒత్తిడి చేశారని తెలుస్తోంది. కలెక్టర్ పనితీరు బాగున్నందున ఆమె బదిలీ నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల బదిలీ అయినా.. ఆమె విధుల నుంచి రిలీవ్ కాలేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వం తాజాగా బదిలీల్లో పమేలా సత్పతిని కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిసింది.కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. పైరవీలు అంటే అసలే పడదు. ఏదైనా పని మీద వచ్చేవారు ఎవరితోనైనా పైరవీ చేసుకొని వస్తే కలెక్టర్‌కు అసలు నచ్చదు. సమస్య పరిష్కారానికి డైరెక్టుగా వెళితే మాత్రం పరిష్కారానికి చొరవ చూపిస్తుంటారు. అధికారులు సైతం వనికి పోతుంటారు అర్హులైన వారు జెన్యూన్‌గా ఉంటే కచ్చితంగా సమస్య పరిష్కారానికి ముందుగా చర్యలు తీసుకుంటారు. అసలైన పేదలకు అన్యాయం జరగవద్దని నిత్యం సమావేశంలో చెబుతూనే ఉంటారు. అవినీతిని మాత్రం సహించరు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. సంక్షేమ పథకాలు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంతో ప్రధానంగా కృషి చేస్తున్నారు. ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నారు



# లోకసభ స్పీకర్ గా ఓం బిర్లా

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 25:**



18వ లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. జూలై 3 వరకు జరిగే ఈ సెషన్‌లో రెండో రోజు కొత్త ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశాల తొలి రోజే 262 మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈరోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, డింపుల్ యాదవ్ సహా 270 మంది ఎంపీలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక సోమవారం రోజునే ప్రధాని నరేంద్ర మోదీ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదే సమయంలో ఇవాళ లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు పేరు ఖరారు కానుంది.లోక్‌సభ మాజీ స్పీకర్‌గా మరోసారి ఓం బిర్లా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈమేరకు ఉదయం 11:30 లోక్‌సభ సెక్రటేరియట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఓం బిర్లా పార్లమెంట్ పీఎంవోలో జరుగుతున్న సమావేశం నుంచి బయటకు వచ్చారు.

లోక్‌సభ స్పీకర్ పదవికి ఓం బిర్లా పేరును ఎన్డీయే కూటమి ఖరారు చేసింది. కాసేపటి తర్వాత పార్లమెంటు హౌస్‌లోని ప్రధాని మోదీతో అమిత్ షా, జేపీ నడ్డా, ఓం బిర్లా సమావేశమయ్యారు. ఎన్డీయే నేతలతో కలిసి స్పీకర్ పదవి కోసం ఓం బిర్లా నామినేషన్ దాఖలు చేశారు.మరోవైపు విపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవిని బీజేపీ ఇవ్వవచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్డీయే స్పీకర్ అభ్యర్థి నామినేషన్ కోసం నేతలంతా తరలివచ్చారు.

నేతలంతా కలిసి నామినేషన్ పత్రాలు, ప్రతిపాదనలు దాఖలు చేయనున్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పేర్లపై ఏకాభిప్రాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రముఖ ప్రతిపక్ష నేతలతో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీలతో ఆయన మాట్లాడారు.

**బరిలో ఇండియా కూటమి అభ్యర్థి**

లోక్‌సభ స్పీకర్ పదవిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో విపక్షాలు తమ అభ్యర్థిని ప్రకటించాయి. ప్రతిపక్షాల స్పీకర్ అభ్యర్థిగా కె.సురేష్ బరిలోకి దిగుతున్నారు. ఈమేరకు ఆయన నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు ఎన్డీయే తరపున లోక్‌సభ స్పీకర్ పదవికి ఓం బిర్లా నామినేషన్ దాఖలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జూన్ 26న బుధవారం జరగనుంది. స్పీకర్ పదవికి ఎన్నికలు జరగడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఇప్పటి వరకు అధికార, విపక్షాల ఏకాభిప్రాయంతోనే స్పీకర్‌ను ఎన్నుకునేవారు.

అయితే ఈసారి ఈ సంప్రదాయానికి బ్రేక్ పడే అవకాశం కనిపిస్తోంది.అంతకుముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో ఫోన్‌లో మాట్లాడి స్పీకర్ పదవికి మద్దతు కోరారు. స్పీకర్ పదవికి విపక్షాలు మద్దతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని, అయితే ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అయితే దీనిపై రాజ్‌నాథ్ సింగ్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి తరుపున సురేష్‌ను బరిలోకి దింపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.కె సురేష్ 8 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1989, 1991, 1996, 1999, 2009, 2014, 2019, 2024లో ఎంపీగా ఎన్నికయ్యారు. కే సురేష్ కేరళలోని మావెలిక్కర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. అత్యంత అనుభవం ఉన్న ఎంపీ అయినప్పటికీ ప్రొటెం స్పీకర్‌గా ఎన్నిక కాకపోవడంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. 1989లో తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2009లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కె సురేష్ అక్టోబర్ 2012 నుండి 2014 వరకు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పని చేశారు.

**సంప్రదాయాలకు విరుద్ధం**

ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. లోక్ సభకు ఎన్నికైన ఎంపీలతో ప్రోటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. అయితే స్పీకర్ ఎంపిక విషయంలో ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య పోటీ నెలకొంది. రెండోసారి ఓం బిర్లాను స్పీకర్‌గా ఎంపిక చేసింది ఎన్డీయే కూటమి. అందుకు సంబంధించి ఆయన నామినేషన్ కూడా దాఖలు చేశారు.

అదే క్రమంలో ఇండియా కూటమి తరపున సురేష్‌చేత నామినేషన్ దాఖలు చేయించారు. దీనిపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. ఈరోజు తాము స్పీకర్ పదవికి సంబంధించి ప్రతిపాదనను అధికారులకు అందజేశామని, తమ వద్ద స్పీకర్‌ను ఎన్నుకునేందుకు తగిన సంఖ్యాబలం ఉందన్నారు. అయినప్పటికీ ఇండియా కూటమి స్పీకర్ పదవికి నామినేషన్ వేయడం పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం అని తెలిపారు.

స్పీకర్ ఎంపిక విషయంలో తమ పార్టీ నుంచి మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాలు ఇండియా కూటమి నేతలతో మాట్లాడారని చెప్పారు. ఇదే క్రమంలో స్పీకర్ పదవికి మద్దతు ఇవ్వాలంటే డిప్యూటీ స్పీకర్ పదవి తమకు కేటాయించాలని వారు కోరినట్లు చెప్పారు. అయితే డిప్యూటీ స్పీకర్ అంశాన్ని ఇండియా కూటమి నేతలు లేవనెత్తినట్లు తెలుస్తోంది. ఆ పదవిని నిర్ణయించినప్పుడు తిరిగి చర్చలు జరుపుతామని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి నేతలతో చెప్పినట్లు ప్రహ్లాద్ జోషి వివరించారు. ఏది ఏమైనా పార్లమెంట్ లో స్పీకర్ ఎన్నికకు కావల్సిన సంఖ్యాబలం తమవద్ద ఉందని ఇండియా కూటమి నేతలు తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని, లోక్ సభ స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు మద్దతు ఇవ్వాలని తాను ప్రతిపక్ష నేతలను కోరుతున్నానన్నారు.

# శాస్త్రీయ విద్యా విధానంపై ఏఐఎస్ఎఫ్ ఉద్యమించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై హేతుబద్ధతతో తిరుగుబాటు నీట్ అవకతవకలకు పాల్పడ్డ బాధ్యులను కఠినంగా శిక్షించాలి.
- పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయాలి.
- కరీంనగర్లో ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల ప్రారంభం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేటి సాంబశివరావు



**జయభేరి, కరీంనగర్ :**

వామపక్ష విద్యార్థి నాయకులతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, విద్యను అర్జిస్తూనే హేతుబద్దతతో ఆలోచించి పాలనను ప్రతిబింబించే సమాజంపై తిరుగుబాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేటి సాంబశివరావు పిలుపునిచ్చారు. కరీంనగర్లో మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఏఐఎస్ఎఫ్ జెండాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం సిపిఐర రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి విద్యను.. కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవతకవకలు జరిగాయని దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరువకముందే దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, యుజిసి ఎన్ఏటి పరీక్షలో జరిగిన అవతవకలపై సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని, తక్షణమే అందుకు బాధ్యులుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్ 7 వేల కోట్ల పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు టిసిలు ఇవ్వని పరిస్థితుల్లో ప్రభుత్వమే ప్రైవేట్ కళాశాలలకు బాధ్యత వహించాలన్నారు. పరిపాలనకు, సమాజానికి సంబంధం లేకుండా దేశంలో క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్నారు. పాలనను ప్రతిబింబించే సమాజంపై తిరుగుబాటు చేయాలన్నారు. విద్యను అర్జించే వారికే ఆ హక్కు ఉంటుందని, హేతుబద్ధతతో ఆలోచించి ముందుకు పోవాలన్నారు. ప్రజాస్వామిక లౌకిక దేశం అనే భావన వక్కనపెట్టి మతపరమైన హిందూ దేశంగా మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. వేల సంవత్సరాల చరిత్రలో నకల కుల మతాలు, సంస్కృతీ సాంప్రదాయాలున్న భారతదేశంలో హిందువులకు రక్షణ లేదంటూ బిజెపి ప్రజలను మభ్యపెడుతోందన్నారు. దేవుడు శాసిస్తాడు.. మోడీ పాటిస్తాడు అనే రీతిలో పాలన సాగుతోందన్నారు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుగా 240 స్థానాలతో బిజెపి నరిపెట్టుకుందన్నారు. వదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు? ఎన్ని ఇళ్లు? ఇచ్చారని ప్రశ్నించారు. విలువలు నేర్పడానికి మతం పుట్టిందన్నారు. 5 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన రాముడిని, హిందూ మతాన్ని మోడీ హైజాక్ చేశారన్నారు. రాముడు అందరివాడని వామపక్ష భావాలు కలిగినవారందరూ ప్రభావితం చేయగలగడంతో ప్రజలకు అర్ధమయ్యిందన్నారు. బ్రిటీష్లు పాలించిన 200 సంవత్సరాలలోనూ హిందువులున్నారు కదా? అని ప్రశ్నించారు. మరి ప్రజాస్వామ్య దేశంలో హిందువులకు రక్షణ లేదని బిజెపి చెప్పడమేమిటన్నారు. కారుచీకటిలో కాంతిరేఖలో వెలుగులు నించడమే కమ్యూనిస్టుల ఆలోచన విధానమన్నారు. చేగువేరా, భగత్ సింగ్ విప్లవవీరులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థి సంఘ నాయకులకు హేతుబద్ధ విధానం, సామాజిక స్పృహ ఉండాలని, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలన్నారు. 80 శాతం సంపద వంద కుటుంబాల చేతుల్లో ఉండగా దేశాన్ని శాసిస్తున్నారన్నారు. జెండాలు పట్టుకోవడమే కాదని చదువుకుంటూనే నమాజాన్ని చదవాలని, ప్రశ్నించే తత్వంతోనే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఒక్క సిరాచుక్క లక్షల మెదడులను ప్రభావితం చేయగలుగుతుందని, జిల్లాలో ఏఐఎస్ఎఫ్ నిర్మాణాత్మక కమిటీలు బలోపేతం చేసి సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు.

అనంతరం ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గత 50 సంవత్సరాల అనుభవంలో విద్య కాషాయీకరణ, శాస్త్రీయ విద్యా విధానం అమలు జరగడం లేదని వాపోయారు. విద్యనందించే ఉపాధ్యాయులకే ఉత్తమ శిక్షణ ద్వారానే మార్పు సాధ్యమవుతుందన్నారు. నాణ్యమైన విద్య అందడం లేదని, కేవలం సర్టిఫికెట్లు సాధిస్తే ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. జ్ఞానం కోసం చదివి నైపుణ్యం సంపాదించుకుంటే జీవితంలో ముందుకు పోతామన్నారు. అజ్ఞానానికి ఫ్యాక్టరీలు పెరగడమే తప్ప రేపటి సమాజానికి అవగాహన ఎలా? అని ప్రశ్నించారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని విధానాలపై ప్రశ్నించాలన్నారు. పోరాటంలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే బాధ్యతను గుర్తెరగాలన్నారు. తప్పును ఎత్తిచూపడమే కాదని, నిర్మాణాత్మకంగా నిలబెట్టేలా ఉండాలన్నారు. తప్పును పరిష్కరించాల్సిన అవసరముందన్నారు. తప్పించుకునే మనస్థత్వం మార్గం వెతకకుండా ముందుడి నిలబడి పోరాడాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొయ్యాడ సృజన్ కుమార్, మాజీ రాష్ట్ర నాయకులు మంద పవన్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు మహేందర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం, సోతుకు ప్రవీణ్, రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, జనార్ధన్, అంజి, సంతోష్, వెంకటేష్, శరత్, అన్వర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.






# మేడిపల్లిలో పందెం కోళ్ళు

- 11 మంది అరెస్ట్.. మూడు పందెం కోళ్ళు, 39,600/- నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం

**జయభేరి, మేడిపల్లి :**

పందెం కోళ్ళతో కోడిపందాలు నిర్వహిస్తున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ నగర కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సత్యనారాయణపురం కాలనీలో గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు కోడిపందాలు ఆడుతుండగా సమాచారం అందుకున్న ఎస్ ఓటి, మేడిపల్లి పోలీసులు కోడిపందాల స్థావరాలపై మెరుపు దాడి చేశారు. 11 మంది కోడిపందాల రాయుళ్లను పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నున్న 3 పందెం కోళ్ళు, కోడి కత్తులు, రూ.39, 600/నగదు, సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ చేసిన ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి బెట్టింగులకు పాల్పడ్డ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారిలో కుంచాల శివ, కందుల చెన్నయ్య, మేళం వెంకట్రావు, తన్నీరు హరిప్రసాద్, చప్పా రాములు, తన్నీరు నరసింహారావు, వల్లపు శ్రీను, తన్నీరు నర్సింహ, మేళం రమేష్, మంటల పోతురాజు, రామశెట్టి శ్రీను లు ఉన్నారు.



# యువత గంజాయికి దూరంగా ఉండాలి

- గోవింద రెడ్డి ఇన్స్పెక్టర్ మేడిపల్లి

**జయభేరి, మేడిపల్లి :**




రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు సంబంధించి పోలీస్ సిబ్బంది ఈ నెల 24నా బోడుప్పల్ ఏరియాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా రెండు ద్విచక్ర వాహనాల మీద తిరుగుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి దగ్గర ఒక బ్యాగ్ లభ్యమయింది. బ్యాగును పరిశీలించి చూడగా అందులో దాదాపు కిలోపైన గంజాయి దొరికింది. వెంటనే ఆ వ్యక్తులను, రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా వారి పేర్లు.. 1. కూరెళ్ల సాయికుమార్ @ సాయి (25), వృత్తి ప్రైవేట్ జాబ్ R/0. శేష సాయి నగర్ బోడుప్పల్. 2. శివరాత్రి వినయ్ కుమార్(22), వృత్తి. విద్యార్థి, R/0. శేష సాయి నగర్, బోడుప్పల్. 3. కోడిదల మనోజ్(24), వృత్తి. ప్రైవేట్ జాబ్, R/0: శేష సాయి నగర్, బోడుప్పల్. 4. సంతోష్ కుమార్(27), వృత్తి. ప్రైవేట్ జాబ్, R/0 కటక్, ఒడిశా. ఈ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర దాదాపుగా 1100 గ్రాముల గంజాయి రెండు ద్విచక్ర వాహనాలను, 6 సెల్ ఫోన్లు సీజ్ చేసి చట్ట ప్రకారం Cr.no :701/24 U/Sec 8(c) r/w20(b)(ii)(B),29 of NDPS Act 1985 కేసు నమోదు చేసి పైన తెలిపిన నలుగురు వ్యక్తులను రిమాండ్కు తరలించడం జరిగింది. అలాగే మేడిపల్లి పోలీస్, SOT సిబ్బంది జాయింట్ ఆపరేషన్లో భాగంగా ఈ నెల 24నా బోడుప్పల్ ఏరియాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని పరిశీలించి చూడగా ఒక బ్యాగ్ లభ్యమయింది. బ్యాగును పరిశీలించి చూడగా అందులో దాదాపు 1300 గ్రాముల గంజాయి దొరికింది వెంటనే అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా అతని పేరు.. 1. జున్ను సంతోష్ కుమార్ @ సంతు (28, వృత్తి: కూలి పని, R/0 సీతాఫల్మండి, సికింద్రాబాద్ ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని దాదాపుగా 1300 గ్రాముల గంజాయి సీజ్ చేసి చట్ట ప్రకారం Cr.no :702/24 U/Sec 8(c) r/w20(b)(ii)(B),29 of NDPS Act 1985 కేసు నమోదు చేసి అట్టి వ్యక్తిని రిమాండ్కు తరలించడం జరిగింది.





ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మేడిపల్లి గోవింద రెడ్డి యువతను హెచ్చరిస్తూ సూచనలు చేస్తూ.. మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, ఇందుకు కారణమవుతున్న గంజాయి పై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాలు లేకుండా చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురి కాకుండా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఇవ్వాలని ఆయన కోరారు.



# యమున భాయ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**జయభేరి, మేడిపల్లి :**

ప్రభుత్వ పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. హబ్సిగుడా డివిజన్, ZPHS పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అయన కుమారుడు కాలేరు నవీన్ ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొని 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మేటీరియల్ వారి చేతుల మీదుగా ఇవ్వటం జరిగింది. యమున భాయ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం అని ఆయన అన్నారు. అలాగే పాఠశాలకు సంబందించిన సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యపై సానుకూలంగా స్పందించి ఏటువంటి సమస్యనైనా తప్పకుండ నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప ఉపాధ్యాయులు, BRS పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, గంథం నాగేశ్వరావు, కాలేరు సుధాకర్, అజిత్ రెడ్డి, సురం శంకర్, చాంద్ పాషా, బొసాని పవన్, అద్విత్, శ్యామ్, నాని, చందు, లక్ష్మణ్ రావు, మహిళ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గోన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన అజ్జు



**జయభేరి, మేడిపల్లి :**

నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీవీ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, తెలంగాణ ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ అహ్మద్, MLC తీన్మార్ మల్లన్న, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రెష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీలో చేరిన అజ్జు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీలో చేరిన అజ్జుకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు, విధానాలు పాటించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు మజర్, మహేశ్వరప్ప, ఉపేందర్, మాధవ్, విజయ్, అస్లాం, వేణు మాధవ్, బంటి, బన్ను, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరి

- ఇల్లందు డిఎస్పి చంద్రభాను,సిఐ సత్యనారాయణ



**జయభేరి, ఇల్లందు :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మంగళవారం ఇల్లందు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.నెంబర్ ప్లేట్ లేని 26 వాహనాలను పట్టుకొని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి,నెంబర్ ప్లేట్లను అమర్చి ఫైన్ లు వేశారు.కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,సీఐ బత్తుల సత్యనారాయణ,ఎస్ఐ సందీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యాసంస్థల బంద్ కు పిలుపునిస్తున్న కేతావత్ బాబురామ్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల అక్రమ ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని పాఠశాల విద్యలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జూన్ 26న విద్యాసంస్థల బంద్ కు పిలుపునిస్తున్న విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు కేతావత్ బాబురామ్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# జాతీయ అవార్డు 2024 ఉత్తమ సర్పంచ్

- నేనావత్ నారాయణ నాయక్

✍ **జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం సూర్య తండా గ్రామపంచాయతీ కి చెందిన నేనావత్ నారాయణ నాయక్. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుండి ఉన్నత విద్య అయినా ఎంటెక్ పూర్తి చేసి చాలా సంవత్సరాలుగా ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చాలామంది విద్యార్థులకు సేవలందించి తదుపరి ప్రజలకు సేవచేయ ఉద్దేశంతో దేవరకొండ మండలం,సూర్య తండా గ్రామపంచాయతీ సర్పంచిగా ఉంటూ సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, పేదలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి వైద్య విద్య పరంగా చాలామంది సేవ చేస్తూ మెడికల్ డొనేషన్ క్యాంపులో గ్రామ వీధిలైట్లు పరిసరాల పరిశుభ్రత హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం తదితర విషయాల్లో గ్రామపంచాయతీ తీర్చిదిద్దినందుకు గాను 2024 సంవత్సరానికి సమాజ సేవ చేసినందుకుగాను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ, నల్లగొండ జిల్లా సెలెక్టెడ్ కమిటీ జిల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అవార్డును ఎన్నిక చేశారు. ఎన్నిక చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును హైదరాబాద్లోనే బహుజన సాహితీ అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. మహారాష్ట్ర లోని పూణేల నిర్వహించే బహుజన రైటర్స్ నాలుగవ సమావేశం సందర్భంగా ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డును అందజేయ నున్నట్టు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని ఈ కాన్ఫరెన్స్ లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరవుతారని తెలిపారు. బహుజన అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి అవార్డును సెలెక్ట్ చేసినందుకుగాను మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సేవ చేస్తానని నేనావత్ నారాయణ తెలిపారు.

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవం

- మత్తును ఆపకపోతే చిత్తే
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవం
- ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ
- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్




✍ **జయభేరి, దేవరకొండ :**

మత్తు వదలరా ఆ మత్తులో పడితే గమ్మత్తుగా చిత్తువుదవురా అని 50 ఏళ్ల క్రితం ఓ సినీ కవి రాసినట్టుగా యువత పెడదారి పడుతుందని దేవరకొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులు అన్నారు. నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలో ఎక్సైజ్ ,పోలీస్, రెవేన్యూ శాఖల ఆధ్వర్యంలో ఎం కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాధకద్రవ్యాల దుష్ఫలితాలు , వాటి నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించి కళాశాల నుండి మీనాక్షి సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ ముఖాముఖిలో మాట్లాడుతూ మాదకద్రవ్యాలు అనగా మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే పదార్థాలు అని, వీటిని ప్రపంచమంతా డ్రగ్స్ అని పిలుస్తారని అన్నారు. మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని,ఈనాటి యువతరాన్ని దారి మళ్లించి దూరాలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైందని అన్నారు. ధూమపానం,మద్యపానం వంటి వ్యసనాల కన్నానల్ల మందు, మార్ఫింగ్,చరస్,కొకైన్,ఎల్ ఎస్ డి, మొదలైన మాదకద్రవ్యాలు చాలా ప్రమాదమని అన్నారు. వీటిని అలవాటు పడిన విద్యార్థులు యువకులు, చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారని అన్నారు. ఒక్కసారి దీనికి బానిసైలు అయిన తర్వాత వీనిని సంపాదించడానికి ఎంతటి ఆకృతాలు నేరాలు చేయడానికి అయినా వెనుకాడరని అన్నారు. ఎంతో ఉత్తమమైన లక్ష్యాలను ఎంచుకున్న విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా సమాజానికి తెలిపారు.

# కుకుడాల శివాజీ మృతి బాధాకరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



✍ **జయభేరి, దేవరకొండ :**

శివాజీ కుటుంబ సభ్యులను పరామర్శించిన నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. దేవరకొండ పట్టణానికి చెందిన కుకుడాల శివాజీ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.మంగళవారం ఇటీవల మరణించిన శివాజీ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా శివాజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు,నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ,యువజన విభాగం మండల అధ్యక్షులు రమావత్ తలిసిరాం నాయక్, పగిడిమర్రి నాగరాజు, జామీర్, తదితరులు ఉన్నారు.

# జీతం కోసం కాదు.. జీవితం కోసం ఉద్యోగం ముఖ్యం

- చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోవద్దు.
- జాబ్ మేళాకు హాజరైన వారు ఆఫర్ లెటర్లతో ఇంటికెళ్లాలి.
- నేను నాలుగు ఉద్యోగాలు మారి ఈ స్థాయికి వచ్చా.
- కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుంది
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



✍ **జయభేరి, కరీంనగర్ :**

కొత్తపెల్లిలో మానకొండూర్ ఎమ్మెల్యే సతీమణి అనురాధ తో కలిసి మెగా జాబ్ మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జీతం కోసం కాదు.. జీవితం కోసం ఉద్యోగం ముఖ్యమని, ముందుగా చిన్న ఉద్యోగం వచ్చిన వదులు కోవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సాయిరాం గార్డెన్ లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మానకొండూరు ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గం నుంచి మెగా జాబ్ మేళాకు సుమారు 6000 మంది హాజరయ్యారని తెలిపారు. అందరూ దాదాపు ఉద్యోగాలు పొంది ఆపర్ లేటర్లతో ఇంటికెళ్లాలని సూచించారు. తాను నాలుగు ఉద్యోగాలు మారి ఈ స్థాయికి వచ్చానని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఇలాంటి జాబ్ మేళాలను నిర్వహిస్తున్నదని, నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. 68 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయని, ఇందులో 25 కంపెనీలు స్పాట్లోనే ఉద్యోగాలకు ఎంపిక చేసే ఆఫర్ లేటర్లు ఇస్తున్నారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కుటుంబాలు చిన్నభిన్నమవుతాయని పేర్కొన్నారు. ఏ ఉద్యోగం వచ్చినా ముందడుగు వేయాలని, చిన్న పెద్ద తేడా లేకుండా ముందుకెళ్లాలని సూచించారు. చాలామంది యువత దళారులకు డబ్బులు అందిస్తూ ఉద్యోగాల పేరిట మోసపోతున్నారని పేర్కొన్నారు. కంపెనీలే మన ముందుకు వచ్చి ఉద్యోగులను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. మహిళలు పెద్ద ఎత్తున ఉద్యోగాలు పొందాలని సూచించారు. మానకొండూర్ ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి ప్రతి కుటుంబానికి ఉద్యోగం అవసరమని పేర్కొన్నారు. అవకాశాలను వినియోగించుకొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సతీమణి ఉద్యోగాలు సాధించిన వారికి ఆఫర్ లేటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైస్ ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ కనకయ్య ఎంపీపీలు ముద్దసాని సులోచన శ్రీనివాస్ రెడ్డి, వుట్కూరి వెంకటరమణారెడ్డి నాయకులు మోరపల్లి రమణారెడ్డి, కొత్త తిరుపతి రెడ్డి చింతల లక్ష్మారెడ్డి, వినయ్ కుమార్, పులి కృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూలై మొదటి వారంలో కేబినెట్ విస్తరణ

✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 25:**

తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జూలై మొదటి వారంలోనే విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అడుగు ముందుపడనుంది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కేబినెట్ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల అంశంపై ఢిల్లీ పెద్దలతో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.గతేడాది డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టింది. ఇదే రోజు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి తోపాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుత కేబినెట్ లో 11 మంది మంత్రులు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి ఈ సంఖ్య 12గా ఉంది. మరో ఆరు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీటి కోసం పలువురు నేతలు చాలా రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రభుత్వ ఏర్పాటు తర్వాత... కీలక నేతలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఖాళీలను కూడా భర్తీ చేయాలని భావించినప్పటికీ లోక్ సభ ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం.... ఎన్నికలపై ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు రావటంతో మళ్లీ పాలనపై ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. ఇదే సమయంలో పూర్తిస్థాయి కేబినెట్ టీమ్ తో ముందుకెళ్లాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇక నామినేటెడ్ పోస్టులను కూడా భర్తీ చేయాలని యోచిస్తున్నారు.మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు స్థానాలు మాత్రమే ఖాళీ ఉండగా... వీటి కోసం చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు కూడా వీటిని ఆశిస్తున్నారు. మరికొంతమంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా ఆయా జిల్లాల్లో సమీకరణాలు మారిపోతున్నాయి. దీంతో కేబినెట్ లో ఎవరికి చోటు దక్కబోతుందనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుత కేబినెట్ లో నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. విస్తరణలో ఆ నాలుగు జిల్లాలకు కచ్చితంగా చోటు కల్పించాల్సి ఉంటుందన్న చర్చ గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు మంత్రులు ఉన్నారు. బీసీ, ఎస్సీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు ఉండగా.. ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. అయితే విస్తరణలో కూడా సామాజిక సమీకరణాలు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి ఎవరూ లేరు. అయితే ఇటీవలే బీఆర్ఎస్ కు చెందిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఇక్కడ సీన్ మారిపోయింది. కేబినెట్ రేసులో ఆయన కూడా ఉన్నారన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇదే జిల్లా నుంచి మదన్ మెహన్ తో పాటు సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి రేసులో ఉన్నారు.కేబినెట్ లో చోటు కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జి. వివేక్, ప్రేమ్ సాగర్ రావు రేసులో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి మాత్రమే ఛాన్స్ దక్కే అవకాశం ఉంది. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు లేరు. తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచి మాత్రమే ఖాతా తెరిచింది. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీలో చేరారు. ఆయన సిటీ నుంచి కేబినెట్ బెర్త్ ను కోరుతున్నారు. ఆయనే కాకుండా పలువురు నేతలు కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు.విస్తరణలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ బెర్త్ దక్కే అవకాశం ఉందన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ కోణంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఆయనకు ఖరారయ్యే అవకాశం ఉందంటున్నారు.ఇక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మరో ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు కల్పించే ఛాన్స్ ఉంది. అయితే ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యేతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలు కావటంతో.... వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చన్న టాక్ కూడా వినిపిస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో మైనారీవర్గాలకు చెందిన మంత్రి లేరు. దీంతో విస్తరణలో తప్పకుండా మైనార్టీ కోటా నుంచి ఒకరికి ఛాన్స్ దక్కటం ఖాయంగా కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ గా బీసీ వర్గానికి చెందిన నేతకు ఇచ్చే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది..!



# వారాహి అమ్మవారి దీక్షలో పవన్

✍ **జయభేరి, విజయవాడ, జూన్ 25:**

వారాహి అమ్మవారి దీక్ష దేవి భక్తులకు దీని గురించి చెప్పనక్కర్లేదు. చాలామందికి ఈ తరహా దీక్ష ఉందని తెలీదు కూడా. ఇప్పుడు ఈ దీక్ష సిద్ధమవుతున్నారు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్. 11 రోజులపాటు అమ్మవారి దీక్షలో నిమగ్నం కానున్నారు. ఇంతకీ ఈ దీక్ష ఉద్దేశం ఏంటి? ఎందుకు 11 రోజులు మాత్రమే చేస్తారు?.గడిచిన ఎన్నికల్లో జనసేన పార్టీ 21 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఆ క్రమంలో పవన్ కల్యాణ్ అమ్మవారికి మొక్కుకున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో దీక్షకు డిప్యూటీ సీఎం సిద్ధమైనట్టు చెబుతున్నారు. వారాహి అమ్మవారు లలితాదేవి సైన్యాధిపతి. శత్రు భయం ఉండ కూడదని దేవి భక్తులు ఆమెని ఆరాధిస్తారు. శత్రువులను జయించడం, జీవితంలో స్థిరత్వం రావడం, అరిషడ్వర్గాల నుంచి తన మనసును ఆధీనంలో ఉంచుకోవడం దీక్షలో కీలకమైనవి. ఇందుకోసం అమ్మవారి దీక్ష చేపడతారు.వారాహి అమ్మవారి దీక్ష జేష్ఠ్య మాసం చివర ఆషాడ మాసం మొదట్లో చేపడతారు. అన్ని దీక్షల మాదిరిగానే ప్రతిరోజూ తల స్నానం, మెడలో ఓ కండువా, చెప్పులు లేకుండా నడవడం, నేలపై నిద్రపోవడం, అమ్మ వారికి సంబంధించి స్తోత్ర పఠనం చేస్తారు. పాలు, పండ్లు తీసుకుంటారు. నవరాత్రి దీక్ష మాదిరిగానే తొమ్మిది రోజులు. కాకపోతే కొంతమంది 11 రోజులు చేస్తారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పాలన సవ్యంగా సాగాలని ఎలాంటి అడ్డంకులు రాకుండా చూడాలని ముఖ్యంగా శత్రువులను ఎదుర్కోవాలని వారాహి అమ్మవారి దీక్షలో నిమగ్నమవుతు న్నారు. మన దేశంలో వారణాసి, ఒడిషాల్లో అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో పలుచోట్ల వారాహి అమ్మవారి ఆలయాలు కొలువుతీరాయి.పురాణాల ప్రకారం దుర్గాదేవికి ఏడు ప్రతి రూపాలుగా సప్త మాతృకలుంటారు. వారిలో ఒకరు వారాహి అమ్మవారు. పురాణాల ప్రకారం అంధకాసురుడు, రక్తబీజుడు, శుంభనిశుంభ వంటి రాక్షసులను సంహరించడంతో వారాహి అమ్మవారి ప్రస్తావన కీలకం. అమ్మవారు రూపం వారాహి ముఖంతో ఎనిమిది చేతులతో పాశం, నాగలి, శంఖ చక్రాలు వంటి ఆయుధాలతో కనిపిస్తుంది.

# సేవారత్న జాతీయ అవార్డు అందుకున్న RTI రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్

✍ **జయభేరి, దేవరకొండ :**

సేవారత్న నేషనల్ అవార్డు 2024 సంవత్సరమునకుగాను కొర్ర కిషన్ నాయక్ అందుకున్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర కన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ (BSA) జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ గారి చేతులమీదుగా అవార్డు అందుకున్నాను. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ... ఎస్.సి ఎస్.టీ బి.సి. &మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ దేశంలోనీ 27 రాష్ట్రాలలో, ప్రపంచంలో నీ 8దేశాలలో పనిచేస్తూ ఉన్నది. అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, కవులకు, రచయితలకు మరియు స్వచ్ఛందంగా సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలియజేశారు. తెలంగాణలోని 33 జిల్లాల నుండి సుమారుగా 200 మంది డెలిగేట్స్ ఈ కన్ఫరెన్స్ కి హాజరైనరాని తెలియజేశారు. అవార్డు అందజేసిన వారితో పాటుగా.BSA జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ,దరువు ఎల్లన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యం. యం. గౌతమ్, రాష్ట్ర కమిటీ సభ్యులు డా.. చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మరియు తుదితరులు పాల్గొన్నారు.



# మూవీభేరి



# పారిస్ కోచర్ వీక్‌లో జాన్వీకపూర్ ర్యాంప్ వాక్..

దివంగత అలనాటి అందాల తార శ్రీదేవి తనయగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి.. తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకునే ప్రయత్నంలో ఫుల్ బిజీగా ఉంది జాన్వీకపూర్. ధడక్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ భామ హిందీతోపాటు తెలుగులో కూడా తన ఫాలోయింగ్ పెంచుకునేందుకు రెడీ అవుతోంది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే జాన్వీకపూర్ తాజాగా పారిస్ కోచర్ వీక్‌లో సందడి చేసింది. శక్తులు, సౌరభాలను చాలా అందంగా నిక్షిప్తం చేసిన మీ అద్భుతమైన ప్రదర్శనలో నన్ను కూడా భాగం చేసినందుకు రాహుల్ మిశ్ర ధన్యవాదాలు. పారిస్ కోచర్ వీక్‌లో ర్యాంప్‌పై హొయలుపోతూ దిగిన స్టిల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందమైన హనీమూన్ షూట్‌లో ధగ ధగ మెరిసిపోతూ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఇటీవలే మిస్టర్ అండ్ మిసెస్ మహి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన జాన్వీకపూర్ ప్రస్తుతం హిందీలో Ulajh సినిమాలో నటిస్తోంది. స్పై థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 2న గ్రాండ్‌గా విడుదల కానుంది. జాన్వీకపూర్ మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న దేవరలో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోండగా.. బుచ్చిబాబు సాన, రాంచరణ్ కాంబోలో వస్తున్న ఆర్‌సీ 16లో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది.



# 35-చిన్న కథ కాదు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రానికి '35చిన్న కథ కాదు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నందకిషోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. 'వినోద ప్రధానంగా తెరకెక్కించిన చక్కటి కుటుంబ కథా చిత్రమిది. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో పాటు కావాల్సినంత కామెడీతో ఆకట్టుకుంటుంది. నివేదా థామస్, ప్రియదర్శి పాత్రలను నవ్యరీతిలో తీర్చిదిద్దాం. వివేక్‌సాగర్ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్‌సాగర్, సంభాషణలు: నందకిషోర్ ఈమాని, ప్రశాంత్ విఘ్నేష్ అమరావతి, రచనదర్శకత్వం: నందకిషోర్ ఈమాని.

# యాక్షన్ ఘట్టాల్లో విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. చిరంజీవితో పాటు పలువురు ముఖ్యతారాగణం ఈ షెడ్యూల్‌లో భాగమవుతున్నారని తెలిసింది. ఈ పోరాట ఘట్టాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, చిరంజీవి మేకోవర్ అభిమానులను అలరిస్తుందని చిత్రబృందం చెబుతున్నది. పంచభూతాలు, ముల్లోకాల కాన్సెప్ట్ ప్రధానంగా ఫాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



# నేతాజీ మార్గంలో నేను..

కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భారతీయుడు2'. శంకర్ దర్శకుడు. జూలై 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. సిద్ధార్థ్ చెప్పే డైలాగ్స్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. వ్యవస్థలోని అవినీతిని అరికట్టడానికి సేనాపతి తిరిగి రావాల్సిందేనని ప్రజలు భావిస్తుంటారు. ఈ నేపథ్యంలో సేనాపతి ఎంట్రీ ఇస్తాడు. సేనాపతిగా కమల్‌హాసన్ విభిన్న గెటప్స్‌లో కనిపించారు. యాక్షన్, విజువల్స్ హైలైట్‌గా నిలిచాయి. 'ఇది రెండో స్వాతంత్ర్య పోరాటం. గాంధీజీ మార్గంలో మీరు..నేతాజీ మార్గంలో నేను. ఇక ఆట ఆరంభమైంది' అంటూ సేనాపతి చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. సీక్వెల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ కనిపించనున్నారు. ఎస్.జె.సూర్య, సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్, జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: రవివర్మన్, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్, నిర్మాత: సుభాస్కరన్.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com